సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.706 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం 52.706 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.90,960
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,258
3శాతం జీఎస్టీతో	రూ.8,506
నవర (8గ్రా)	రూ.68,048

గరిష్టం/కనిష్టం
36.6 /27.9

వాతావరణం
జిల్లాలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 365 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 300 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 65 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి వి.మహేష్ కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 280, కనిష్ట ధర రూ. 230 లభించగా, సగటున రూ.262.74 లభించిందన్నారు. వేలంలో 10 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 7,961 మంది విద్యార్థులకు 7,410 మంది హాజరు కాగా, 551 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

రూ.300 కోట్ల స్త్రీనిధి రుణాలు

- తక్కువ వడ్డీతో అందించేలా చర్యలు
- స్త్రీ నిధి ఏజీఎం కామాక్షయ్య



సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య

నెల్లూరు (పొగతోట): ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ, పట్టణ ప్రాంత స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు తక్కువ వడ్డీతో రూ.300 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య తెలిపారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య 19వ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఏజీఎం మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక మహిళలు బకాయిలు అధికంగా ఉండడంతో స్త్రీనిధి రుణాలు ఇవ్వడం నిలిపి వేశామన్నారు. ఈ నెల నుంచి తిరిగి స్త్రీనిధి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు స్త్రీనిధి రుణాలు దోహద పడతాయన్నారు. సున్నా వడ్డీకే రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయం ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేస్తే స్త్రీనిధి రుణాలు వడ్డీ లేకుండా మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఆనంద్




మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్‌హాల్‌లో సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2019 అక్టోబర్ 10వ తేదీ కంటే ముందు భూమిని ఆక్రమించుకుని ఆర్‌సీసీ స్లాబు లేదా రేకులతో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉండే వారు ఆ ఇంటిని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని, అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుతో జారీ చేసి రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై అధికారులు అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని, భూ వివాదాలను ప్రతి నెల మొదటి శనివారం తహసీల్దారు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ కొంత సమయం కేటాయించి పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్‌కార్డులు లేక ఎటువంటి ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్న ఎస్టీల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె కార్తీక్, డీఆర్‌ఓ ఉదయభాస్కర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ, అశోక్‌కుమార్, ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

- ట్రంప్ సుంకం దెబ్బకు ధరలు భారీగా పతనం
- టన్నుపై రూ.40 వేల నుంచి రూ.80 వేలు తగ్గింపు
- అమెరికాలో 20, 30, 40, 50 కౌంట్లకే మార్కెట్

50 నుంచి 100 కౌంట్ వరకు ఇతర దేశాలకు ఎగుమతులు

అయ్యో.. రొయ్య



అసలే ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగాన్ని అమెరికా సుంకం మరింత దెబ్బతీసింది. రొయ్యల ధరలు భారీగా పతనమయ్యాయి. మన దేశానికి సంబంధించి ఆక్వా ఉత్పత్తులు అమెరికాతోపాటు ప్రపంచంలోని అనేక దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. కానీ ఒక్క అమెరికా సుంకం సాకు చూపించి అన్ని కౌంట్లపై భారీగా ధరలు తగ్గించడంతో ఆక్వా రైతులు విలవిలలాడుతున్నారు. ప్రధానంగా అమెరికాలో భారత్‌తోపాటు ఈక్వెడార్ రొయ్యలకే డిమాండ్ ఉంది. మన దేశ ఉత్పత్తులపై 26 శాతం సుంకం విధిస్తుండగా, ఈక్వెడార్ ఉత్పత్తులపై 10 శాతమే సుంకం విధిస్తుండడం గమనార్హం.

కావలి: జిల్లాలో ఆక్వాకు గడ్డు పరిస్థితులు ప్రారంభమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన తాజా సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రావడంతో ఆ ప్రభావం రొయ్యల ఎగుమతి ధరపై పడింది. 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.240 నుంచి రూ.200కి తగ్గిపోయింది. వాస్తవానికి అమెరికా ప్రజలు 50, 40, 30, 20 కౌంట్ ఉండే రొయ్యలను కొనడానికి ఇష్టపడతారు. ఆ కౌంట్లలోని రొయ్యలనే అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ట్రంప్ సుంకాన్ని సాకుగా చూపించి అన్ని కౌంట్లపై కిలోకు రూ.40 నుంచి రూ.80 వరకు తగ్గించారు. టన్నుపై రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు ధరలు పతనమయ్యాయి.

చైనా మార్కెట్‌పై దృష్టి

అమెరికా సుంకాలను దృష్టిలో పెట్టుకుని 50 కౌంట్ కంటే తక్కువ కౌంట్ ఉన్న రొయ్యల కొనుగోలును ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, ఎగుమతిదారులు నిలిపివేశారు. 50 కౌంట్ కంటే ఎక్కువ కౌంట్ ఉన్న రొయ్యలకు ఇతర దేశాల్లోనూ మార్కెట్ ఉండడంతో ప్రధానంగా చైనా మార్కెట్‌పై ఎగుమతిదారులు దృష్టి పెట్టారు. కిలోకు 50, 60, 70, 80, 90, 100 కౌంట్ ఉన్న రొయ్యలను ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కిలోకు 100 కౌంట్ రూ.240 ఉండగా రూ.200లకు తగ్గించారు. 60 కౌంట్ ధర రూ.330 ఉండగా రూ.250కు తగ్గించేశారు. 50 నుంచి 100 కౌంట్ ఉన్న రొయ్యలకు చైనా మార్కెట్‌లో డిమాండ్ ఉంది.

ఏటా 2.25 లక్షల టన్నుల ఎగుమతి

సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా రెండో స్థానంలో ఉంది. జిల్లాలో 110 కి.మీ. సముద్ర తీరం వెంబడి ఉలవపాడు, గుడ్లూరు, కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు తదితర 9 మండలాల పరిధిలో 55,000 మంది మత్స్యకారులు సముద్రంలో వేట సాగిస్తున్నారు. 30,000 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. సముద్రం వేట ద్వారా లభించే రొయ్యలు, సాగు ద్వారా లభ్యమయ్యే రొయ్యలు వెరసి ఏటా 2.25 లక్షల టన్నులు ఎగుమతి అవుతాయని అంచనా. అమెరికా, చైనా, సౌత్ ఈస్ట్ ఏషియన్ దేశాలు, యూరోపియన్ యూనియన్ దేశాలు, జపాన్ తదితర దేశాలకు జిల్లా నుంచి రొయ్యలు ఎగుమతులు అవుతుంటాయి. వైజాగ్, కృష్ణపట్నం, కాకినాడ, చెన్నై పోర్టుల నుంచి విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. జిల్లా పరిధిలో ఏడాదికి సుమారు 10 లక్షల టన్నుల మత్స్య సంపద వస్తుంటే, అందులో సుమారు 4 లక్షల టన్నులు స్థానికంగా విక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన 6 లక్షల టన్నులు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇందులో చేపలు మాత్రం ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా, రొయ్యలు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.



రొయ్యలు చెరువులు



రొయ్యలు

ట్రంప్ దెబ్బ.. మన రొయ్యకే

అమెరికా మార్కెట్‌లో మన దేశం రొయ్యలతో పాటు ఈక్వెడార్ దేశం నుంచి వచ్చే రొయ్యలకే అత్యధిక డిమాండ్ ఉంది. అయితే మన దేశం నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే రొయ్యలపై 26 శాతం సుంకం విధించిన ట్రంప్ ఈక్వెడార్ దేశం నుంచి దిగుమతి అయ్యే రొయ్యలపై 10 శాతం మాత్రమే సుంకం విధించడం గమనార్హం. అమెరికా మార్కెట్‌లో మన దేశం రొయ్యల ధరలు అధికంగా ఉంటే, ఈక్వెడార్ దేశం రొయ్యలు తక్కువ ధరలకు అందుబాటులో ఉంటాయి. ఈ పరిణామంతో అమెరికా మార్కెట్ నుంచి మన దేశం రొయ్యలు కొనుగోలు చేసే పరిస్థితి తగ్గిపోతోంది.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



రొయ్య పిల్లల ధరలు, ఫీడ్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరలు నిలకడగా ఉండేలా, ధర గిట్టుబాటు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ ఏడాది జనవరిలో 30 కౌంట్ రొయ్య ధర కిలో రూ.600 వరకు ఉంది. తర్వాత క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.400 స్థాయికి చేరింది. సగటున కిలో రూ.200 తగ్గింది. 50 కౌంట్ రొయ్యలకు ఇప్పుడు రూ.300 మాత్రమే దక్కుతోంది.

– సాలా మహేష్, ఆక్వా రైతు, అల్లూరు

ఆర్థికంగా చితికి పోతున్నాం



అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రొయ్యలకు సరైన ధర లభించకపోవడంతో ఆర్థికంగా చితికి పోతున్నాం. ఫీడ్ ఖర్చు పెరిగింది. విద్యుత్ బిల్లులూ తడిసి మోపెడవుతున్నాయి. కిలో రొయ్యల ఉత్పత్తికి సగటున రూ.300 పెట్టుబడి అవుతుంది. అమ్మకం ద్వారా సగటున కిలోకు రూ.250 నుంచి రూ.270 మాత్రమే వస్తోంది. అంటే కిలోకు రూ.40 చొప్పున నష్టపోతున్నాం. మరో వైపు జనవరి నుంచి రొయ్యల ధరలు తగ్గాయి.

– వెంకటేష్, ఆక్వా రైతు, అల్లూరు

వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోయాయ్



మృతదేహంతో కలిసి ఆస్పత్రి వద్ద డాక్టర్లతో వాగ్వాదానికి దిగిన బంధువులు

- ఆరోగ్యశ్రీ పరిధి దాటిందంటూ వైద్య సేవలు నిలిపేశారు
- నెల్లూరు నారాయణ ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

నెల్లూరు(అర్బన్): వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబ సభ్యుడి ప్రాణం పోయిందంటూ రోగి బంధువులు నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి ఆందోళన చేశారు. మృతుడి సోదరుడు శ్రీపతి వెంకటేశ్వర్లు సమాచారం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు మండలం చమర్తి గ్రామానికి చెందిన శ్రీపతి రాజా (30)కు భార్యతో పాటు 5 నెలల కుమారుడు, 3 ఏళ్ల కుమార్తె ఉంది. కుటుంబ సమస్యల నేపథ్యంలో 18 రోజుల క్రితం శ్రీపతి రాజా పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను నెల్లూరులోని నారాయణ ఆస్పత్రికి తీసుకు వచ్చారు. డాక్టర్లు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. మొదట్లో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం చేశారు. అయితే ఆరోగ్యశ్రీ పరిధి దాటిందని, డబ్బులు చెల్లిస్తేనే వైద్యం చేస్తామని ఆస్పత్రి డాక్టర్లు చెప్పడంతో తాము రూ.70 వేలు చెల్లించామన్నారు. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తీసుకెళ్లాలని భావించామన్నారు. ప్రాణాలతో తమకు అప్పగించాలని కోరి అంబులెన్స్‌లో వెంటిలేటర్‌పై చెన్నైకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. అయితే ఆస్పత్రి వర్గాలు ఐసీయూ నుంచి బయట ఉన్న అంబులెన్స్‌కు తరలించేలోపు పేషెంట్ మృతి చెందాడంటూ మృతదేహాన్ని అప్పగించారన్నారు. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని సర్దుబాటు చేసి పంపించారు. ఈ విషయమై ఆస్పత్రి వర్గాలను వివరణ కోరగా పేషెంట్ శ్రీపతి రాజా ఆస్పత్రికి వచ్చేటప్పటికే సీరియస్‌గా ఉందని, చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో పార్టీ నగర, జిల్లా నాయకులు

పోలీసుల తీరు దుర్మార్గం

- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసుల విషయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని ఆ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాకాణి పారిపోయారని, విదేశాలకు వెళ్లారంటూ టీడీపీ నేతలు నిస్సిగ్గుగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం మీ చేతుల్లోనే ఉంది కదా? ఆయన ఎక్కడ ఉన్నాడో తెలుసుకోలేరా?.. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ అసత్య ఆరోపణలు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. కాకాణి తనపై నమోదు చేసిన అక్రమ కేసుల విషయంలో న్యాయపరంగా పోరాడేందుకు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అక్రమ మైనింగ్ కేసులో కాకాణి ఎలాంటి విచారణకైనా సిద్ధమని, పారిపోయే నైజం ఆయనది కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేతలపై తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించి కేసులు నమోదు చేసే సంస్కృతి ఎక్కడా లేదన్నారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసు వ్యవస్థే అక్రమ కేసులు బనాయిస్తూ ఉంటే ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. కాకాణిపై రుస్తుం మైన్స్‌కు అనుమతులు లేకుండా నాలుగు నెలల పాటు తన అనుచరుల ద్వారా అక్రమ మైనింగ్ జరిపారనే అభియోగం మోపి పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారని తెలిపారు. మైన్‌లో పేలుడు పదార్థాలు దొరికాయని, దళితులను దూషించారని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఇలా ఇష్టారీతిలో అక్రమ కేసులు నమోదు చేస్తూ అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో టీడీపీ నేతలు ఈ మైన్‌లో అక్రమ మైనింగ్ జరుగుతుందని ఆరోపించిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారణకు ఆదేశించారని తెలిపారు. విచారణలో అధికారులు ఇక్కడ ఎలాంటి అక్రమ మైనింగ్ జరగ లేదని క్లీన్ చిట్ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం మారడంతో తప్పుడు వాంగ్మూలం నమోదు చేయించి కాకాణి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చినప్పుడు ఇలాంటి కేసులే మేమూ నమోదు చేస్తే ఒక్కరూ కూడా తప్పించుకోగలరా అని టీడీపీ నేతలను ప్రశ్నించారు.

రైతులను ఇబ్బందులు పెట్టకండి

- డీఎస్‌ఓ విజయ్‌కుమార్

నెల్లూరు (పొగతోట): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు చేపట్టాలని డీఎస్‌ఓ విజయ్‌కుమార్ సీఎస్‌డీటీలను ఆదేశించారు. మంగళవారం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కార్యాలయంలో సీఎస్‌డీటీలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్‌ఓ మాట్లాడారు. ఖరీఫ్ కోతలు పూర్తి కావస్తున్నాయన్నారు. ఈ సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించే పీపీసీల ద్వారా రైస్ మిల్లులకు పంపించాలన్నారు. రైస్ మిల్లుల్లో జాప్యం లేకుండా ధాన్యం అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకుని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌ఓ

వంటింట్లో మోదీ మంట

సామాన్యుడి వంటింట్లో ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది.



- ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంపు
- జిల్లా ప్రజలపై నెలకు రూ.3.92 కోట్ల మేర అదనపు భారం

సీతారామపురం: కేంద్రం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.840 ఉండగా తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచుతున్నట్లు ప్రకటించింది. మంగళవారం నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై ఈ పెంపు మరింత భారం కానుంది. ఈ క్రమంలో ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం వదల్లేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింప చేసింది. ఇకపై ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్‌లో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు ఇవ్వకనే ఇచ్చినట్లు అయింది.

నెలకు రూ.3.92 కోట్లకు పైగా భారం

జిల్లా వ్యాప్తంగా వినియోగదారులపై నెలకు రూ.3.92 కోట్ల మేర అదనపు బాదుడు పడనుంది. జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం 7,87,484 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో 2,616 మాత్రమే వాణిజ్య పరమైనవి. మిగిలిన 7,84,867 కనెక్షన్లకు ధరల పెంపు వర్తించనుంది. ఈ లెక్కన జిల్లాలోని వినియోగదారులపై రూ.3,92,43,350 అదనంగా భారం పడింది. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ సిలిండ ధర రూ.840 ఉండగా ఇకపై రూ.890 కానుంది. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చార్జీల పేరుతో వసూలు చేస్తున్న మొత్తం అదనం కానుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏజెన్సీల పరిధిలో ఐదు కి.మీ.లోపు అదే ధరకు వినియోగదారులకు ఇవ్వాల్సి ఉండగా అది ఎక్కడా అమలు కావడం లేదు.

సామాన్యులపై తీవ్ర ప్రభావం



వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపు సామాన్య ప్రజలకు, మహిళలకు భారమవడమే గాక పేద, మధ్య తరగతి ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే కొనలేని స్థితిలో ఉన్న గ్యాస్ సిలిండర్ ధర మరింత పెరగడం గృహిణులను ఆవేదనకు గురి చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సిలిండర్ ధరలతోపాటు, నిత్యావసర సరుకుల ధరలను సైతం నియంత్రించాలి.

– పిడుగు నీలవేణి గృహిణి, సీతారామపురం

ధరల పెంపుతో తప్పని తిప్పలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఒక వైపు కూరగాయల ధరలు భగ్గుమంటూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో, మరొక వైపు వంట గ్యాస్ సిలిండర్ ధర పెరగడం చాలా బాధాకరం. ప్రభుత్వాలు స్పందించి ధరలను అదుపు చేసి, పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– కోడె రమాదేవి, గృహిణి, పడమటి రొంపిదొడ్ల

గ్రంధి యానాదిశెట్టి విగ్రహావిష్కరణ



కావలి: పట్టణ ఆర్యవైశ్య నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత గ్రంధి యానాదిశెట్టి విగ్రహాన్ని స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ కూడలిలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రంధి యానాది శెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కచ్చేరి మిట్ట రోడ్డు వద్ద సన్మాన కార్యక్రమం జరిగింది.

క్లుప్తంగా

ఓటు వేస్తే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చేలా చూడాలి

• హైకోర్టులో రిట్ పిటిషన్

నెల్లూరు(అర్బన్): ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రోగ్రెస్ కార్డును, ఓటు హక్కు వినియోగించుకుంటే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ నెల్లూరు విజయమహల్ గేట్ సమీపంలోని వెంకటరామపురానికి చెందిన అలహరి వెంకటేశ్వర్లు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీ తదితర 16 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ పిటిషన్ వేశారు. దీనిపై హైకోర్టు విచారణ ప్రారంభించింది. యాప్‌లో ఓటర్ నంబర్ లేదా ఆధార్ నంబర్ నమోదు చేస్తే ఓటు వేసి ఉంటే ఫొటో డిస్‌ప్లే అయ్యేలా చూడాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచే మద్యాన్ని నిషేధించాలన్నారు. ఓటు హక్కు గురించి అవగాహన కల్పిస్తూ హైస్కూల్ స్థాయిలోనే పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి



చిన్న ఓబయ్య మృతదేహం

సీతారామపురం: మండలంలోని గంగవరం గ్రామంలో చిన్న ఓబయ్య (48) అనే వ్యక్తి మిద్దెపై నుంచి కింద పడి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. సోమవారం రాత్రి ఓబయ్య నిద్రపోవడానికి మిద్దెపైకి వెళ్లాడు. మంగళవారం వేకువజామున మూత్రవిసర్జనకు వెళ్తూ ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి కింద పడి చనిపోయాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఫోన్ ఎక్కువగా చూస్తున్నావని తల్లిదండ్రులు మందలించడంతో యువతి అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్ నగర్‌లో సురేష్ అనే వ్యక్తి కుటుంబం నివాసం ఉంటోంది. అతడి కుమార్తె నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె ఎక్కువగా ఫోన్ చూస్తుండటంతో ఇటీవల తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యువతి ఇంట్లోంచి వెళ్లిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు గాలించారు. జాడ తెలియకపోవడంతో నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తెలిపారు.

పాముకాటుకు వార్డు మెంబర్ బలి

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ వెంకటరమణమ్మ (40) పాముకాటుతో మంగళవారం మృతిచెందింది. స్థానికుల కథనం మేరకు.. కొమ్మలపూడి పంచాయతీ 7వ వార్డు మెంబర్ వెంకటరమణమ్మ తన భర్త ఆదిశేషయ్యతో కలిసి పొలం పనులకు వెళ్లింది. గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు లోనైన వెంకటరమణమ్మను చికిత్స నిమిత్తం బంధువులు నెల్లూరుకు తరలిస్తుండగా దారిలో మరణించింది. రమణమ్మ మృతితో దళితవాడలో విషాదం నెలకొంది. రమణమ్మకు కుమార్తె ప్రతిమ, కుమారుడు సతీష్ ఉన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.110
సన్నవి	రూ.90
పండ్లు	రూ.60

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	110
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	198
బ్రాయిలర్ స్కిన్‌లెస్	220
లేయర్ చికెన్	170

మాకు వాటా ఇవ్వాల్సిందే..

లంచాలు, అవినీతి, కమీషన్ల కోసం ఐసీడీఎస్‌లో పెద్ద పంచాయితీ నడుస్తోంది. దీనికి కారణం ఈవెంట్లకు సంబంధించిన నగదు ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల ఖాతాల్లో జమ చేయడమే. వాటిలో తమకు వాటా ఇవ్వాలని సూపర్‌వైజర్లు డిమాండ్ చేశారు. అలా ఇస్తే ఎలా అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై వారి మధ్య వివాదం నెలకొంది.

- ఐసీడీఎస్‌లో ఈవెంట్ల లొల్లి
- ప్రభుత్వ సొమ్ము స్వాహా కోసం యత్నం
- ఒక్కో కేంద్రం నగదు ఇవ్వాల్సిందే అంటున్న సూపర్‌వైజర్లు
- మరీ ఇంత దోపిడీనా అని ప్రశ్నిస్తున్న కార్యకర్తలు



ఉలవపాడు ఐసీడీఎస్ కార్యాలయం

ఉలవపాడు: కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాలున్నాయి. మొత్తం 184 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతి నెలా గర్భిణులకు సీమంతాలు, పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన, ఇతర కార్యక్రమాల కోసం ప్రభుత్వం రూ.500 చొప్పున ఇస్తుంది. వేసవి సెలవుల్లో కేవలం 15 రోజులు మాత్రమే కేంద్రాన్ని కార్యకర్త తెరుస్తారు. కాబట్టి ఆ నెలలో రూ.250 ఇస్తారు. 11 నెలలకు సంబంధించి రూ.5,500 మరో సగం నెలకు రూ.250 కలిపి రూ.5,750 ఇటీవల కార్యకర్తల బ్యాంక్ ఖాతాల్లో గత నెలలో జమైంది.

మాకు డబ్బులివ్వాలి

ప్రభుత్వం జమ చేసిన మొత్తంలో ఒక్కో కేంద్రం నుంచి తమకు రూ.2,400 ఇవ్వాలని సూపర్‌వైజర్లు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఈవెంట్లు సక్రమంగా చేయలేదని చెబుతూ కొంత మొత్తాన్ని తమకు ఇస్తేనే చూసీచూడనట్లు ఉంటామని కార్యకర్తలతో వాదిస్తున్నట్లు తెలిసింది. నగదు వసూలు చేయడానికి కొందరు అంగన్‌వాడీలను నియమించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా ప్రతినెలా ఒక్కో సెంటర్ నుంచి రూ.200 కూడా వీరే వసూలు చేస్తారు. ఈ నగదు ఇస్తున్న కార్యకర్తలు ఈవెంట్ల డబ్బును ఇవ్వడానికి ఇష్టపడటం లేదు. ఇంత దారుణం ఏంటని చర్చించుకుంటున్నారు.

అంతా లంచాలమయం

ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లంచాలమయంగా మారిపోయింది. 184 సెంటర్లకు సంబంధించి రూ.10.58 లక్షలు కార్యకర్తల ఖాతాల్లో జమయ్యాయి. ఇందులో రూ.4.41 లక్షలు సూపర్‌వైజర్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉలవపాడు మండల పరిధిలో ఐదుగురు సూపర్‌వైజర్లున్నారు. సక్రమంగా ఈవెంట్లు చేయలేదు కాబట్టి ఒక్కో కార్యకర్త రూ.3,350 పెట్టుకుని మిగిలిన రూ.2,400 ఇవ్వాలని వారు ఒత్తిడి తీసుకొస్తున్న దుస్థితి ఉలవపాడు ప్రాజెక్ట్‌లో నెలకొంది. దీనికితోడు కూరగాయలు, గ్యాస్ బిల్లులు కూడా బ్యాంక్ ఖాతాల్లో పడ్డాయి. వీటిలో 15 శాతం కచ్చితంగా కార్యాలయ సిబ్బందికి ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. చాలాకాలంగా సిబ్బంది ఈ కమీషన్ తీసుకుంటున్నారు.

నష్టపోతుంది చిన్నారులే..

ప్రాజెక్ట్ పరిధిలో ఇంత దారుణంగా ఈవెంట్ల పంచాయితీ ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోందనే ఆరోపణలున్నాయి. ఇక్కడకు నూతనంగా వచ్చిన సీడీపీఓ అరుణకుమారి పూర్తిస్థాయిలో పరిస్థితులను గమనించకపోవడం. సూపర్‌వైజర్లు చెప్పినట్లే వినడం తప్ప వారు క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారో దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఏది ఏమైనా కార్యక్రమాలు పూర్తిస్థాయిలో జరపకుండానే బాగా చేశామని చూపడం, దానికి సంబంధించిన నిధులు పంచుకోవడం చూస్తుంటే చివరికి నష్టపోతుంది ఈ సెంటర్లకు వెళ్తున్న చిన్నారులే. ప్రభుత్వం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఖర్చు పెట్టమని ఇస్తున్న నిధుల్ని స్వాహా చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులను సక్రమంగా వినియోగించి అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగుపరచడానికి ఉన్నతాధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నేను కొత్తగా వచ్చాను. సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో మాట్లాడతాం. అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాను.

– నిర్మలాదేవి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ

పీఎంజేఏవై కార్డులతో ఉచిత వైద్యం

- 70 ఏళ్లు నిండిన వారు కార్డులు తీసుకోవాలి
- ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్, పక్కన వెంకటమురళి

నెల్లూరు(అర్బన్): 70 ఏళ్ల వయసు నిండిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన స్కీం (పీఎంజేఏవై), ఎన్టీఆర్ వైద్యసేవ సంయుక్త కార్యక్రమం ద్వారా సంవత్సరానికి రూ.5 లక్షల ఉచిత వైద్యం అందుతుందని ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న కార్యాలయంలో మంగళవారం ఆయన జిల్లా మేనేజర్ వెంకట మురళితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్డు పొందేందుకు ఆదాయంతో పని లేదన్నారు. దేశంలో ఎక్కడైనా నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. కార్డులను పొందేందుకు క్షేత్రస్థాయిలోని వైద్యారోగ్య శాఖకు చెందిన ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేస్తున్నారన్నారు. ప్రజలు సహకరించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంజేఏవై, జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ పథకంలో పేర్ల నమోదులో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఈ స్కీంలోకి రారన్నారు.

కుమారుడిని పరీక్షకు తీసుకెళ్తుండగా..

- స్కూటీని ఢీకొన్న కారు
- తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు




అంబులెన్స్‌లో క్షతగాత్రుడి తరలింపు

ఉలవపాడు: కుమారుడిని ప్రాక్టికల్స్‌కు తీసుకెళ్తున్న సమయంలో స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడిన ఘటన ఘటన జాతీయ రహదారిపై రాజుపాళెం – చాగల్లు మధ్య మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెదపూడి అజయ్ తన కుమారుడు అభిలాష్‌ను కావలిలోని జవహర్ భారతి కళాశాలలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు స్కూటీపై తీసుకెళ్తున్నాడు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు వేగంగా స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. రోడ్ సేఫ్టీ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- పెండింగ్ వ్యవసాయ సర్వీసుల మంజూరు
- ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేసవి నేపథ్యంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్ అన్నారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా సర్కిల్లో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసుల్ని మంజూరు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. వేసవి నేపథ్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయితే వెంటనే మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక విద్యుత్ లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్స్ లోడ్ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ బిల్లుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్‌ను ముద్రిస్తున్నామని, ఫోన్‌పే, గూగుల్‌పేలో బిల్లులు చెల్లించే సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశం ప్రస్తుతానికి నెల్లూరు నగర విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. అడిషనల్ లోడ్‌ను క్రమబద్ధీకరిస్తే 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. జూన్ 30వ తేదీ లోపు దీనిని వినియోగించుకోవాలని కోరారు.

కక్ష కట్టి కుకింగ్ ఏజెన్సీ తొలగింపు

- వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని అన్యాయం
- హడావుడి చేసిన పోలీసులు
- త్రిసభ్య కమిటీ సూచనతోనే తొలగించామంటున్న హెచ్‌ఎం



పోలీసుల సమక్షంలో మధ్యాహ్న భోజన పథకం గదిని తెరిచిన దృశ్యం

కందుకూరు రూరల్: వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని ఓ మహిళను మధ్యాహ్నం భోజన పథకం బాధ్యతల నుంచి తొలగించారు. దీనికి సంబంధించి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం కొంత గందరగోళం ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఎస్‌కే ముంతాజ్ బేగం అనే మహిళ ఏజెన్సీ నిర్వహిస్తుండగా కూటమి ప్రభుత్వం రాగానే తొలగించారు. దీంతో ఆమె కోర్టుకెళ్లింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం గతేడాది డిసెంబర్ 9వ తేదీ నుంచి తిరిగి ముంతాజ్ బేగంకు ఏజెన్సీని అప్పగించారు. మంగళవారం నుంచి ముంతాజ్ బేగంను తొలగించి ఎస్‌కే రిజ్వానాకు బాధ్యతలు అప్పగించాలని వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ ఉత్తర్వులిచ్చింది. హెచ్‌ఎం ద్వారకారాణి సోమవారం ముంతాజ్ బేగానికి ఉత్తర్వులివ్వగా తీసుకోలేదు. మంగళవారం భోజనం వండేందుకు ఆమె పాఠశాలకు రాగా హెచ్‌ఎం అడ్డుకున్నారు. మిమ్మల్ని తొలగించి రిజ్వానాకు ఏజెన్సీ ఇచ్చినట్లు చెప్పాం కదా అన్నారు. సమయం ఇవ్వకుండా ఇప్పటికిప్పుడు వెళ్లిపోమని చెప్తే ఎలా అని ముంతాజ్ ప్రశ్నించారు. దీనిపై కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో హెచ్‌ఎం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చారు. ఏజెన్సీ నిర్వాహకులు, హెచ్‌ఎంతో మాట్లాడి నూతనంగా ఏర్పాటు చేసిన రిజ్వానాకు వంట చేయాలని బాధ్యతలు అప్పగించారు.

అన్యాయంగా తొలగించారు

కోర్టు ఆర్డర్ ప్రకారం నాకు తిరిగి ఏజెన్సీని అప్పగించారు. అయినా నోటీసులిచ్చారు. దీనిపై కోర్టుకు వెళ్లాం. గత నెల 28న నోటీసులపై కోర్టు నివేదిక అడగ్గా అధికారులు నాలుగు రోజుల్లో ఇస్తామన్నారు. ఈలోగా ఎవరెవరో అధికారులొచ్చి తనిఖీలు చేసి వెళ్లారు. పిల్లలు మాపై ఎలాంటి ఆరోపణలు చేయలేదు. వైఎస్సార్‌సీపీ వాళ్లమనే అన్యాయంగా తొలగించారు. మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి వర్గమనే కక్షతో అధికారులు ఏజెన్సీ నుంచి తీసేశారు.

– ఎస్‌కే ముంతాజ్ బేగం

ఉత్తర్వుల మేరకే..

గతంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారం ముంతాజ్ బేగంకు ఏజెన్సీ అప్పగించాం. తిరిగి అధికారులతో కూడిన కమిటీ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం నూతనంగా ఏజెన్సీకి ఇచ్చాం. ఇబ్బంది లేకుండా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నాం.

ద్వారకారాణి, పాఠశాల హెచ్‌ఎం

భార్య గొంతు కోసిన భర్త

• తప్పిన ప్రాణాపాయం

పొదలకూరు: మండలంలోని నల్లపాళెం గ్రామం వడ్డిపాళెంలో మంగళవారం భర్త భార్య గొంతు కోశాడు. ఆమెకు ప్రాణాపాయం తప్పింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రావణిని సంగం మండలం పెరమనకు చెందిన సమీప బంధువు శ్రీనివాసులు వివాహం చేసుకున్నారు. వీరు నల్లపాళెంలో కాపురం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీనివాసులు చాకుతో భార్య గొంతు కోశాడు. స్థానికులు వెంటనే బాధితురాలిని పొదలకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆమెకు ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న ఎస్సై హనీఫ్ వివరాలు సేకరించారు. శ్రావణికి ప్రాణాపాయం తప్పిందని, తమకు కేసు వద్దని బంధువులు వెల్లడించడంతో ఎస్సై స్టేట్‌మెంట్ రికార్డు చేసి పంపించి వేశారు.

రూ.51.81 కోట్లతో 1,240 యూనిట్లు

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ ఏడాది రూ.51.81 కోట్లతో 1,240 మందికి వివిధ యూనిట్లు మంజూరు చేసేందుకు ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ ఒ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో లబ్ధిదారులకు బ్యాంక్‌ల ద్వారా యూనిట్లను అందిస్తామన్నారు. రూ.20.46 కోట్లు సబ్సిడీ, రూ.28.75 కోట్లు బ్యాంక్ రుణాలు, రూ.2.59 కోట్లు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించారన్నారు. ఈనెల 14 నుంచి మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 11 నుంచి 20వ తేదీ వరకు మండల సెలక్షన్ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఎంపికైన వారి జాబితాను బ్యాంక్‌లకు ఎంపీడీఓలు పంపుతారన్నారు. 28 నుంచి జూన్ 12వ తేదీ వరకు బ్యాంక్‌లో రెండు ఖాతాలు తెరవాలన్నారు. 13 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారులకు పాలనా పరమైన ఉత్తర్వులు ఇస్తారన్నారు. 21 నుంచి ఆగస్టు 9వ తేదీలోగా యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.

తవ్వేస్తాం.. అమ్మేస్తాం

- కల్లూరుపల్లిలోని చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- అధికార పార్టీ కార్పొరేటర్ భర్త కనుసన్నల్లో..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో మట్టి లోడ్ చేస్తున్న జేసీబీ



ట్రాక్టర్‌లో తరలిపోతున్న మట్టి



మట్టి తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇసుక, మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. కల్లూరుపల్లిలోని సర్వే నంబర్ 8లోని కొత్త చెరువులో నాలుగు రోజులుగా అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీతో మట్టిని తవ్వి రోజూ ట్రాక్టర్లలో 200 ట్రిప్పుల్లో తరలించేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.1,000 నుంచి రూ.1,200 చొప్పున విక్రయిస్తున్నారని సమాచారం. 24వ డివిజన్ కార్పొరేటర్ భర్త అరవ శ్రీనివాసులు అండదండలతో కాంట్రాక్టర్లు చెరువులోని మట్టిని తరలిస్తున్నారని విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తల్లోనే చెరువులో తవ్వకాలు మొదలయ్యాయి. నాడు సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో కొంతకాలం మిన్నకుండిపోయారు. అప్పుడప్పుడు రాత్రి వేళల్లో తవ్వకాలు చేస్తుండేవారు. అయితే నాలుగు రోజులుగా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. కల్లూరుపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ లేవుట్‌కు మట్టిని తరలిస్తున్నారు. కాగా తవ్వకాల కారణంగా పది అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. తవ్వకాలపై స్థానికులు రెండురోజుల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఉపయోగం లేకుండా పోయింది.